





జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం


# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్


సోమవారం 12 అక్టోబర్ 2026 | పేజీలు : 8


# క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం

ఇద్దరు
అంతర్రాష్ట్ర నిందితు ల
అరెస్ట్
ఐటీసీ గ్లోబల్ పేరుతో నకిలీ వెబ్‌సైట్
రెండేళ్లలో పెట్టుబడులు రె ట్టింపు అవుతాయనిమోసం
పోంజీ స్కీమ్, మల్టీ లెవల్ మార్కెటింగ్ ద్వారా వంద లాది మందికి టోకరా
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రాల్లో 500 మంది బాధితు లు
కోట్లలో మోసం జరిగినట్లు అనుమానం
వరంగల్, కరీంనగర్, నిజా మాబాద్, ఆదిలాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ బా ధితులు
మొత్తం 10 కోట్లకు పైగా మోసం చేసిన నిందితులు
ఆదిలాబాద్ వన్ టౌన్ పరి ధిలో 3 నుంచి సుమారు రూ.21 లక్షలు వసూలు
జూమ్ మీటింగ్‌లు, హోటళ్ల లో సమావేశాలతో ప్రజలకు వల
ఆరుగురిపై కేసు నమోదు..
ఇద్దరి అరెస్ట్, ఆస్తులు, సెల్ ఫోన్లు స్వాధీనం
వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్





# పత్తి పంటలో గంజాయి సాగు



50 గంజాయి మొక్కలు స్వాధీనం.. తలమడుగు మండలం అర్లి గ్రామ శివారులో ఘటన
గంజాయి మొక్కల విలువ సుమారు రూ.5 లక్షలు

## ఘనంగా శరన్నవరాత్రులు
# మండపాల్లో వెలిసిన దుర్గామాతలు

భవానీ దీక్షల్లో వందలాది యువకులు

**ఖానాపూర్ అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి )** ప్రత్యేక దసరా నవరాత్రులలో దుర్గ దేవి నవరాత్రులు( శరన్నవరాత్రులు)సైతం నిర్వహించుకోవడం ఆనవాయితీగా జరుగుతుంది ఈ మేరకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో ఆదివారం దుర్గ మాత విగ్రహాలను స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఉంచి భవాని దీక్షలలతో యువకులు తోపాటు పలువురు భక్తులు మండపాల నిర్వాహ కులు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా తమ మండపాలలో కొలువు తీర్చారు పట్టణంలోని పలు శ్రీరామ్నగర్, శివాజీ నగర్, శాంతినగర్ విద్యానగర్



# కార్మికుల కష్టానికి వచ్చిన లాభాల వాటా చెల్లింపుపై గోప్యత ఎందుకు?

## లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించాలి

## సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ కన్వీనర్ రామగిరి రామస్వామి

**మంచిర్యాల, 11, అక్టోబర్ (ప్రజాజ్యోతి):**సింగరేణి కార్మికుల కష్టానికి ప్రతిఫలంగా రావాల్సిన లాభాల వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీరాంపూర్ ఏరియా బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ కన్వీనర్ రామగిరి రామస్వామి మాట్లాడుతూ, ఆడిట్ పూర్తయి, బోర్డు ఆమోదం పొందిన తర్వాత కూడా యాజమాన్యం లాభాల వివరాలను ప్రకటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బొగ్గు సరఫరాపై సమీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం, సంస్థ లాభాల వాటా చెల్లింపుపై మాత్రం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు.సింగరేణి సంస్థ ఆర్థిక విషయాల్లో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి లాభాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి కార్మికుల శ్రమకు ప్రతిఫలంగా రావాల్సిన లాభాల వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని కోరారు. అదేవిధంగా పదవీ విరమణ పొందుతున్న సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేసే అంశంపై కూడా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నప్పటికీ కార్మికులకు కనీస రక్షణ పరికరాలు అందించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని రామస్వామి విమర్శించారు. సంస్థ ఆర్థిక పరిస్థితి ఒక్కసారి దిగజారితే తిరిగి పుంజుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టమవుతుందని, అధికారులు తమ విధానాలను మార్చుకొని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.




కొత్త గనులు ప్రారంభించామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు గనుల వద్ద జరుగుతున్న నిరసనలపై స్పందించకపోవడం విచారకరమన్నారు. సింగరేణిలో రానున్న ఎన్నికల్లో కార్మికులు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తారని పేర్కొన్నారు. ప్రతి సమస్యపై సానుకూలంగా స్పందిస్తున్నామని చెప్పుకునే ఐఎన్‌టీయూసీ నాయకులు లాభాల వాటా చెల్లింపుపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏఐటీయూసీ కార్మిక శాఖ కమిషనర్ వద్ద కుదుర్చుకున్న తొలి ఒప్పందమైన లాభాల ప్రకటన అంశాన్ని ఎప్పుడు అమలు చేయిస్తారని నిలదీశారు. దసరాలోపు లాభాల వాటా చెల్లిస్తామని చెప్పడం మాత్రమే కాకుండా, అమలు చేసే తేదీని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒప్పందాల అమలుపై స్పష్టత లేకపోతే మిగిలిన ఒప్పందాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంస్థ ఆర్థిక ప్రయోజనాలు, పదవీ విరమణ పొందిన కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం, ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ నాయకులు, పిట్ సెక్రటరీలు సాయిళ్ల శ్రీనివాస్, మెల్లం శ్రీధర్, తోడే సుధాకర్, మీడివెల్లి శ్రీనివాస్, గోదారి భాగ్యరాజు, ఇప్ప నరేష్, వెంకట్‌రెడ్డి, అఖిల్, బోడకుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యంతో కొలువుల బాట.. సింగరేణి యువతకు ఉపాధి బాట!









**ఆర్జీ--1 నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మందికి ఉద్యోగాలు..**

**ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు అవకాశం..**

**తొలి విడతలో 55 మంది హైదరాబాద్‌కు పయనం**

**మంచిర్యాల, 11, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలిస్తోంది. రామగుండం--1 ఏరియాలోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా నిర్వహించిన ఉద్యోగ ఇంటర్వ్యూల్లో 112 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 87 మంది మహిళలు హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలు పొందగా, మరో 25 మంది సోలార్ టెక్నీషియన్లుగా ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్‌కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 87 మందిని హైదరాబాద్‌లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్‌పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు ఎంపిక చేశారు. అదేవిధంగా సోలార్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం 27 మంది పురుష అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో విధుల్లో చేరనున్నట్లు ఆర్జీ--1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ తెలిపారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడనున్నాయని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రం స్థానిక యువతకు శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ అందిస్తూ, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకుంటోంది. సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని జీఎం డి. లలిత్ కుమార్ తెలిపారు. శిక్షణను ఉపాధి అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత తమ భవిష్యత్తును మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తోందని అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్‌కాన్ హెచ్‌ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్‌తోపాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ఈహెచ్ఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి





## తిరుపతి ఆసుపత్రిలో ఎన్ఈహెచ్ఎస్ అమలుపై టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడి పరిశీలన

**మంచిర్యాల, 11,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల పట్టణంలోని తిరుపతి ఆసుపత్రిలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న ఎన్ఈహెచ్ఎస్ పథకం పనితీరును టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పరిశీలించారు. ఈ పథకం ద్వారా ఉద్యోగులకు అందుతున్న వైద్య సేవలు, అమలు తీరు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆసుపత్రి నిర్వాహకులను, సంబంధిత వర్గాలను ఆరా తీశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ఈహెచ్ఎస్ సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎన్ఈహెచ్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచిర్యాలలోని తిరుపతి ఆసుపత్రితో పాటు ఇతర ఎన్ఈహెచ్ఎస్ అనుబంధ ఆసుపత్రుల్లోనూ ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ఈహెచ్ఎస్ పథకం కీలకమన్నారు. ఈ పథకం అమలు తీరును పరిశీలించిన కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, రాగి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, మాజీ కార్యదర్శి రామ్మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సత్యనారాయణ, నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం

## 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన హీమటాలజిస్ట్ డాక్టర్ రంజిత్ కుమార్

**మంచిర్యాల, 11,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ తదితర రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆదివారం ఉచిత హీమటాలజీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరంలో హైదరాబాద్‌లోని సింధు హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ హీమటాలజిస్ట్ డాక్టర్ రంజిత్ కుమార్ సి.ఎస్. 122 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి ఈ సందర్భంగా డాక్టర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, తలసేమియా వ్యాధిగ్రస్తులు వైద్యుల పర్యవేక్షణలో హిమోగ్లోబిన్ స్థాయిలను తగిన స్థాయిలో నిర్వహించుకోవాలని సూచించారు. సాధారణంగా వైద్యుల సూచనల మేరకు హిమోగ్లోబిన్ స్థాయిని 9 గ్రాముల వరకు ఉంచాల్సి ఉంటుందని తెలిపారు. శరీరంలో అధికంగా పేరుకుపోయే ఐరన్‌ను నియంత్రించేందుకు వైద్యుల సలహా మేరకు ఐరన్ చిలేషన్ మందులు వినియోగించాలని పేర్కొన్నారు. తగిన అర్హతలు, వైద్యపరమైన పరిస్థితులు ఉన్న కొంతమంది రోగులకు బోన్ మ్యారో మార్పిడి ద్వారా వ్యాధి నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యాధిగ్రస్తులు అవసరమైన టీకాలను కూడా వైద్యుల సూచనల మేరకు వేయించుకోవాలని తెలిపారు. 976 మంది వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య సేవలు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్ మాట్లాడుతూ, మంచిర్యాల రక్త నిధి కేంద్రం పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్




జిల్లాలకు చెందిన సుమారు 976 మంది తలసేమియా, సికిల్ సెల్ తదితర రక్త సంబంధిత వ్యాధిగ్రస్తులు వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వీరిలో అధికశాతం నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత మందులు అందించడం, డీఎన్ఏ పరీక్షల శిబిరాలు, హెచ్ఎల్ఏ మ్యాచింగ్ క్యాంపులు నిర్వహించడంతో పాటు హైదరాబాద్‌కు చెందిన నిపుణులైన వైద్యులను ఆహ్వానించి హీమటాలజీ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ్డాక్టర్ రంజిత్ కుమార్‌కు సన్మానం శిబిరంలో 122 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సేవలందించిన డాక్టర్ రంజిత్ కుమార్ సి.ఎస్.ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ తరఫున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, రక్త నిధి కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రియాంక సక్సేనా, డాక్టర్ బి. ప్రేమ్ సాయి, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, రక్త నిధి కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే జిల్లా అభివృద్ధి





**ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలు..**
**కోవ లక్ష్మి నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ**

**ఆసిఫాబాద్, అక్టోబరు 11 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగిన ర్యాలీలో జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలు మార్మోగాయి. అనంతరం కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో జిల్లాల ఏర్పాటు ద్వారా పాలన ప్రజలకు చేరువైందన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో వైద్య కళాశాల, సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, మోడల్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, ఆసుపత్రులు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కృషి చేసిందని పేర్కొన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు ఘన సన్మానం

## గోలేటిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సత్కారం



**ఆసిఫాబాద్ , అక్టోబర్ 11 ప్రజా జ్యోతి** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను రెబ్బన మండలం గోలేటి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే లక్ష్యంతో వివిధ అనుబంధ కమిటీలను నియమించిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ కమిటీతో పాటు ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఎస్టీ సెల్‌లు, మహిళా కాంగ్రెస్ కమిటీలకు బాధ్యులను నియమించినందుకు నాయకులు సుగుణక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. సుగుణక్క నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెబ్బన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసరి కిషన్ గౌడ్, పార్టీ నాయకులు, వివిధ సెల్ కమిటీల నూతన బాధ్యులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్‌కే-6 కొత్త రోడ్డులో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు



**మంచిర్యాల, 11, అక్టోబర్, (ప్రజా జ్యోతి):** నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని ఆర్‌కే-6 కొత్త రోడ్డులో శ్రీ దుర్గామాత భక్త మండలి ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. దుర్గామాత ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని హృదయపూర్వకంగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుమ్మడి శ్రీనివాస్, మిట్టపల్లి మొగిలి, మంద శ్రీనివాస్, గోవిందుల సమ్మయ్య, సకిలం మణికంఠ, రాగిశెట్టి శ్రీనివాస్, వేల్పుల కొమురయ్య, దారిపెల్లి కనకయ్యతో పాటు పలువురు యువకులు, మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలతో ఆ ప్రాంతంలో భక్తిపూర్వక వాతావరణం నెలకొంది.

# మంచిర్యాల జిల్లా పదేళ్ల పండుగ

**కేసీఆర్ నాయకత్వంలో జిల్లా ఏర్పాటు.. దశాబ్ది వేడుకలు**



**మంచిర్యాల, 11, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** కేసీఆర్ నాయకత్వంలో, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కృషితో మంచిర్యాల జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా దశాబ్ది వేడుకలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసం వద్ద వృత్తి సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను శాలువాలతో సత్కరించి సన్మానించారు. జిల్లా ఏర్పాటు కోసం సాగిన ఉద్యమం లో భాగస్వాములైన నాయకులు ఉద్యమకారుల సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతిని ధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అశోక్ మహల్కార్

**జిల్లా కమిటీ పదవులకు పలువురి ఏకగ్రీవ ఎన్నిక**



**ఆసిఫాబాద్, అక్టోబరు 11 ప్రజా జ్యోతి** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అశోక్ మహల్కార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల్లో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ వివరాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు కిర్మిళ్ల వినోద్ చారి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కావేటి సభితా మనోహర్ వెల్లడించారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కావేటి మనోహర్, సంయుక్త కార్యదర్శులుగా మాచర్ల శ్రీనివాస్ (కాగజ్‌నగర్), సాయికుమార్ (ఆసిఫాబాద్), యశ్వంత్‌రావు ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎండీ మోసిన్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ అర్షద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా రాథోడ్ పుష్పలత నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా ఆత్రం వినోద్, శశికళను ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా అబ్బూ తాలిబ్, పెందూర్ ధర్ము, నైతం తిరుపతి, జె. కరుణాకర్, పెందూర్ దౌలత్, జీవన్ ఎన్నికయ్యారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా దుర్గం శ్యామ్‌రావు, ట్రేడ్ అండ్ కామర్స్ విభాగం అధ్యక్షుడిగా మైనొద్దీన్, సామాజిక మాధ్యమాల ప్రతినిధిగా షేక్ అదిల్, ఈబీసీ విభాగం అధ్యక్షుడిగా జాడి నందకిషోర్ ఎన్నికైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా ఉద్యమకారుల విభాగం అధ్యక్షుడిగా చోటును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

## 32 జిల్లాల నుంచి సబ్ జూనియర్ క్రీడాకారుల హాజరు

## క్రీడలు క్రమశిక్షణ, పట్టుదలను నేర్పుతాయి: ఎంపీ గొడం నగేష్



**ఆసిఫాబాద్, అక్టోబరు 11 ప్రజా జ్యోతి** క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, స్నేహభావం, లక్ష్యసాధనను నేర్పుతాయని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలను కలెక్టర్ కె.హరిత, ఎస్పీ నితిక పంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలు యువ క్రీడాకారులకు ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు, సమయపాలన, జట్టుగా పనిచేసే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన పి.కౌశిక్ ప్రథమ, హిమంత్ రావు ద్వితీయ, ప్రణీత్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు జ్ఞాపికలు, పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎం.శేకు, డీసీసీ ప్రతినిధి ఆత్రం సుగుణ, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి కొట్నాక విజయ్, అధికారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# గిరిజన యువత అభివృద్ధికి చదువే బలమైన ఆయుధం

## బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వాలి

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11,(ప్రజా జ్యోతి)** ఆదివాసీ గ్రామాల సమగ్ర అ భివృద్ధికి విద్య ఎంతో కీలక మని, గిరిజన యువత జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువే బలమైన ఆయుధమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బాల బాలికలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని పిలు పునిచ్చారు. ఆదివారం సిరికొండ మండలం కోసుపటేల్ గూడ గ్రామంలో ఇంద్రవెల్లి అమరవీరుడు పెందూర్ మచ్చు కుటుంబ సభ్యులైన దుర్గాబాయి--ఆనంద్ రావు దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజ రై ప్రారంభించారు. అనంత రం గ్రామంలో కల్వర్టు, ఇతర మరమ్మత్తుల పనులకు భూమిపూజ చేశారు. అనం తరం గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల ని ర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధి దారులకు అందుబాటులోకి తీ సుకురావాలని అధికారు లను ఆదేశించారు. కోసుపటే ల్ గూడలో గతంలో ఎల్-3 గా ఉన్న లబ్ధిదారుల జాబి తాను ఎల్-1కు మార్పు చే యించి ప్రత్యేకంగా ఇందిర మ్మ ఇళ్లు మంజూరు చేసిన ట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, వీవోలు, అంగన్ వాడీ కేంద్రాలకు మంజూరైన నూతన భవనాల నిర్మాణాలతో పాటు పెండింగ్ పనులను వేగవంతం చేయాల న్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు బాలికలకు సంపూర్ణ మద్దతునిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించగలరని పేర్కొన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గురుకులాల్లో విద్యనభ్యసించే విద్యా ర్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బాలికలను చిన్న వయసులోనే చ దువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు చేయడం సరికాదని, వారి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చే శారు. దసరా సెలవుల అనంతరం విద్యార్థులు తప్ప నిసరిగా పాఠశాలలు, గురుకులాలకు హాజరు కావాలని, సెలవు రోజుల్లో సమయాన్ని వృథా చేయకుండా హోంవర్క్, ప్రాజెక్టులను పూర్తి చేసుకుంటూ క్రమ శిక్షణతో చదువుకోవాలని సూ చించారు. విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే కుటుం బాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. భూగర్భ జలమ ట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో బోర్ల తవ్వకాలపై ఆధా రపడకుండా మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వినియో గించుకోవాలని కలెక్టర్ సూ చించారు. జలసిరి కార్యక్ర మంలో భాగంగా బోర్ల వద్ద రీచార్జ్ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాం డ్లు, పెర్కొలేషన్ ట్యాంకులు ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించుకోవాలని వివరించారు. నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా భవి ష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయ తీరాజ్ ఈఈ శివరామ్, తహశీల్దార్ అరవింద్ కుమార్, ఎంపీడీవో రఘువీర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ డీఈ ర మేష్, సర్పంచ్ గణపతి, నా యకులు ఆడే గజేందర్, స్థా నిక సర్పంచులు గణపతి, బొడ్డు దత్తాత్రి, మాజీ జడ్పీ టీసీ సబ్యులు రఘురా మ్, జిల్లా సార్ మేడి తొ`ం అమృత్ రావు, రిమ్మ మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కు మార్, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు కుమ్ర యాదవ్ రావు పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

## దండేపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**దండేపల్లి,అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):** దండేపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా గోపతి శ్రీనివాస్, అధ్యక్షుడుగా బండి రవి గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా అల్లం కుమారస్వామి యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బచ్చల సుభాష్, కట్ట వెంకటేశ్, మెంగని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల సత్యం, కార్యదర్శులుగా మందల మల్లేష్, ఎల్ల రాజన్నలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా మోదంపురం వెంకటేశ్, అధికార ప్రతినిధిగా ఎండీ షరీఫ్, సంయుక్త కార్యదర్శిగా సద్దాం, ప్రచార కార్యదర్శిగా చుంచు చందు బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులుగా జి. వెంకటపతి, బూసిరాజు రాజన్న, గడ్డం సత్యన్న, కార్యవర్గ సభ్యులుగా శేర్ల చక్రపాణి, జాడి సత్యం, ఎస్.పి. హరీష్‌లను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలో జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు

## భక్తి శ్రద్ధలతో దుర్గా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

### శాకంబరీ మాత ఆలయంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు

### జిల్లా ప్రజలందరికీ దుర్గా న వరాత్రి శుభాకాంక్షలు



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11,(ప్రజాజ్యోతి)** దుర్గా నవరాత్రి ఉత్సవాలను ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా ఘనంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపు నిచ్చారు. ఆదివారం సాయంత్రం ఆదిలాబాద్ పట్టణంలోని బుక్తాపూర్‌లో ఉన్న శా కంబరీ మాత ఆలయంలో, ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గా దేవి నవరాత్రి పూజా కార్యక్ర మంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐ పీఎస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాలొ ని అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ దుర్గా నవరాత్రి శుభా కాంక్షలు తెలియజేశారు. దుర్గా నవరాత్రులు భక్తి,ఆధ్యా త్మికత, శక్తి ఆరాధనకు ప్ర తీకలని, ఈ పవిత్ర పండుగను ప్రజలందరూ భక్తి శ్రద్ధల తో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులు భక్తి భావంతో పూజా కార్యక్ర మాల్లో పాల్గొని, పండుగవా తావరణాన్ని ఆనందంగా ఆస్వాదించాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణలోని ర్వాహకులు, భక్తులు పరస్పర సహకా రంతో వ్యవ హరిస్తూ ప్రశాంతమైన వాతావ రణాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూర్‌లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని కాకా ఫ్రీ కోచింగ్ సెంటర్‌లో ఘనంగా వేడుకలు



**చెన్నూర్ మండలం, అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని కాకా ఫ్రీ కోచింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చెన్నూర్ ఆడపడుచులు, మహిళలు, విద్యార్థినులు అత్యంత ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.రంగురంగుల పూలతో వివిధ ఆకృతుల్లో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో సంబరాలు చేసుకున్నారు. మహిళలు, విద్యార్థినుల ఆటపాటలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ప్రాంగణ మంతా పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## గణేష్ టెంపుల్‌లో అమ్మ వారి మాల ధరించిన మున్సి పల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్





**అదిలాబాద్ టౌన్, అక్టోబర్ 11, (ప్రజా జ్యోతి)**అదిలాబాద్ పట్టణంలోని గణేష్ టెంపుల్‌లో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ భక్తి శ్ర ద్ధలతో అమ్మవారి మాల ధరించి దీక్ష స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఈ సంద ర్భంగా ప్రార్థించా రు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ "అమ్మ వారి మాల ధరించడం ఎంతో పవిత్రమైన ఆధ్యాత్మిక అనుభూతి. భక్తి, విశ్వాసం, నియమ నిష్ఠలతో అమ్మవారి దీక్షను చేపట్టడం మనసుకు ప్రశాంత తను, ఆధ్యాత్మిక బలాన్ని ఇస్తుందని, అమ్మవారి అనుగ్రహంతో ప్రజలం దరూ సుఖశాంతులతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, అమ్మవారి ఆశీస్సులు అదిలాబాద్ ప్రజ లందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప ట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థి స్తున్నానని అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ప్రజల సంక్షేమం కోసం మరింత అంకి తభావంతో పనిచేయాలని అమ్మవారిని వేడుకుంటు న్నాను" అని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తి పూర్వక వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీ స్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని ఆమె ఆకాంక్షించారు.

## కేరమేరి ఎస్సై రాజుకు ఘన సన్మానం

ఖైరీ గ్రామస్థులు, వార్డు సభ్యుల ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమం



**కేరమేరి, అక్టోబరు 11 (ప్రజా జ్యోతి** కేరమేరి ఎస్సై రాజును ఖైరీ గ్రామస్థులు, వార్డు సభ్యుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వార్డు సభ్యుల ఫోరం ఉపాధ్యక్షుడు మందడే శివరాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.గ్రామస్థులు, వార్డు సభ్యుల ఫోరం ప్రతినిధులు కలిసి ఎస్సై రాజుకు తమ అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతి నిధులు పరస్పరం ఆత్మీయంగా మెలిగారు. గ్రామస్థులు, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మందడే శివరాంతో పాటు ఖైరీ గ్రామస్థులు, వార్డు సభ్యుల ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్సై రాజును సన్మానించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## అగ్రసేన్ మహారాజ్ చౌక్ ని ర్మాణానికి భూమిపూజ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



**అదిలాబాద్ టౌన్, అక్టోబర్ 11, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలోని డోక్వాల్ కాంప్లెక్స్ పక్కన అగ్రసేన్ మహారాజ్ చౌక్ ని ర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ భూమిపూజ నిర్వ హించారు. ఈ సందర్భంగా బండారి అనూష సతీష్ మా ట్లాడుతూ అగర్వాల్, మా ర్వాడీ సమాజాలకు ఆరా ధ్యుడైన అగ్రసేన్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ఆయన పేరిట చౌక్ ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణమని, సంతోషంగా ఉందని తెలిపారు. అగ్రసేన్ మహారాజ్ గొప్ప ఆదర్శా లు, సమాజానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. గతంలో క్షత్రియుడిగా ఉన్న అగ్రసేన్ మహారాజ్ మహా భారత యుద్ధ సమయంలో జరిగిన హింసను చూసి, హింసకు దూరంగా ఉంటూ అహింసా మార్గాన్ని ఎంచు కుని వైశ్య సమాజ అభివృ ద్ధికి కృషి చేసిన మహనీ యుడిగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. అలాంటి మహనీయుని పేరిట అగ్రసేన్ మ హారాజ్ చౌక్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉం దన్నారు. ఆయన ఆశయా లు, ఆదర్శాలను భావితరా లకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో అగ్రసేన్ మహారాజ్ కమిటీ సభ్యులు, అగర్వాల్ సమాజ్ కమిటీ సభ్యులు, రాజ స్థానీ సమాజ ప్రతినిధులు, బజరంగ్‌లాల్ అగర్వాల్, మోహన్ అగర్వాల్, ఓమ్‌సెట్, కాలనీవాసులు తది తరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రునికి బాసటగా



**దండేపల్లి, అక్టోబర్ 11(ప్రజాజ్యోతి):**దండేపల్లి మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య (డిష్ పోషన్న) ఇటీవల కరెంట్ షాక్ తో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో పూర్వ విద్యార్థులు( 2000–2001 పదవ తరగతి బ్యాచ్) చిన్నారి సంజన పేరు మీద 43 వేలు ఇంటికి వెళ్లి ఫిక్స్ డిపాజిట్ చేయించారు. పిల్లల భవిష్యత్తు, చదువులకు కూడా సహకరిస్తామని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు అప్పాల మనోహర్, పదవ తరగతి పూర్వ మిత్రులు 2000–2001 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు..

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి డిల్లీ జంతర్ మంతర్ ధర్నా కు బయలుదేరిన

నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఖానాపూర్ అక్టోబర్ 11(ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ కేంద్రంలో జరగనున్న నిరసన ధర్నాకు గురువారం సాయంత్రం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుండి ఢిల్లీ కి తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు తెలంగాణ ప్రజా ప్రతినిధులు శాసన సభ్యులు,శాసన మండలి సభ్యులతో కలిసినిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బయలుదేరి వెళ్లారు నేడు సోమవారం జంతర్ మంతర్ వద్ద జరుగనున్నా బారి నిరసన కార్యక్రమంలో ప్రతి పక్ష నేత కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి పాల్గొంటామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు గత మూడు రోజులుగా మండల, డివిజన్ జిల్లా కేంద్రలతో పాటు ఎస్ఐఆర్ పట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్య దేశ రాజధాని ఢిల్లీలో సైతం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పాల్గొంటున్నామని జిల్లా పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు భోజ్జు పటేల్ "ప్రజా జ్యోతి" చరవాణిలో అన్నారు

# పత్తి పంటలో గంజాయి సాగు

**50 గంజాయి మొక్కలు స్వాధీనం**
**తలమడుగు మండలం అర్లి గ్రామ శివారులో ఘటన**
**గంజాయి మొక్కల విలువ సుమారు రూ.5 లక్షలు**
**నిందితుడిపై తలమడుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు, అరెస్టు, రిమాండ్ తలమడుగు ఎస్ఐ డి రాధిక**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11,(ప్రజా జ్యోతి)** తలమడుగు మండలం అర్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో అక్రమంగా గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని తలమడుగు పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వ్యవసాయ భూమిలోసాగు చేస్తున్న 50 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకు న్నారు. వాటి విలువ సుమా రు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తలమడుగు ఎస్ఐ డి.రాధిక పోలీసు సిబ్బందితో కలిసి అర్లి గ్రామ శివారులోని అనుమానిత వ్యవసాయ భూమిని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పత్తి పంట మధ్యలో అక్కడక్కడ గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించారు. చింతలపల్లి రాజారెడ్డి (65), చింతలపల్లి వెంకటరెడ్డి, అర్లి గ్రామం, తలమడుగు మండలం అనే నిందితుడు తనకు చెందిన సర్వే నంబర్ 62//1లోని 2 ఎకరాల 23 గుంటల వ్యవసాయ భూమిలో పత్తి పంటతో పాటు ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి మొక్కలు సాగు చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సుమారు 50 గంజాయి మొక్కలను పెంచినట్లు తెలిపాడు. పోలీసులు పంచుల సమక్షంలో 50 గంజాయి మొక్కలను లెక్కించి, వాటికి నంబర్లు వేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నిందితుడి పై కేసు నమోదు చేసి, నిం దితుని అరెస్టు చేసి రిమాం డ్ కు తరలించినట్లు తెలిపా రు. ప్రభుత్వ నిషేధిత గంజాయి సాగు, విక్రయం, రవాణాకు పాల్పడితే చట్ట ప్ర కారం కఠిన చర్యలు తీసు కుంటామని తలమడుగు ఎస్ఐ డి. రాధిక తెలిపారు. అక్రమ గంజాయి సాగు, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే 84126 59973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని ఈ నెంబర్ జిల్లా ఎస్పీచే నిర్వహించబడుతుందని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. గంజాయి పండించిన వారికి ప్ర భుత్వ పథకాలు వర్తించ కుండా సిఫార్సు చేయడం జరుగుతుందని గంజాయికి దూరంగా ఉంటూ గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి, యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.

# ఘనంగా శరన్నవరాత్రులు
# మండపాల్లో వెలిసిన దుర్గామాతలు



భవానీ దీక్షల్లో వందలాది యువకులు



**ఖానాపూర్ అక్టోబర్ 11 (ప్రజా జ్యోతి )** ప్రత్యేక దసరా నవరాత్రులలో దుర్గ దేవి నవరాత్రులు( శరన్నవరాత్రులు)సైతం నిర్వహించుకోవడం ఆనవాయితీగా జరుగుతుంది ఈ మేరకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో ఆదివారం దుర్గ మాత విగ్రహాలను స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఉంచి భవాని దీక్షలలతో యువకులు తోపాటు పలువురు భక్తులు మండపాల నిర్వాహకులు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా తమ మండపాలలో కొలువు తీర్చారు పట్టణంలోని పలు శ్రీరామ్నగర్,శివాజీ నగర్, శాంతినగర్ విద్యానగర్ ఇంద్రనగర్ పద్మావతి నగర్ అంబేద్కర్ నగర్లలో ప్రత్యేకంగా దుర్గ భవానికి మండపాలు వేసి రంగరంగుల విద్యుత్తు దీపాలను అలంకరించి అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల రాత్రి వరకు ప్రతిష్ఠించు కున్నారు శరన్ నవరాత్రుల్లో భాగంగా రోజుకొక అవతారంగా దుర్గామాతను అలంకరించి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజలు అన్నదానాలు నిర్వహించడం జరుగుతుందని ఆయా మండపాల నిర్వాహకులు "ప్రజా జ్యోతి"తో అన్నారు

**దీక్షలో యువకులు అమ్మవారిని అనుకరించరాదు**

శరన్నవరాత్రుల్లో భాగంగా నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ముధోల్ ఖానాపూర్ నియోజకవర్గాల్లోని ముఖ్యంగా మండల కేంద్రాల్లో ఆయా ముఖ్య గ్రామాల్లో శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాతను భవాని విగ్రహాన్ని ప్రదర్శించుకుని దీక్షలు భవాని మాల వేసుకోవడం ఆనవాయితీ అత్యంత భక్తిశ్రద్ధలతో నియమ నిబంధనలతో అమ్మవారి సేవలో తరించాల్సిన యువకులు ఈ మధ్యకాలంలో భవాని దీక్ష తీసుకున్నాం కనుక దుర్గ మాత లాగే కళ్ళకు కాటుక, చేతులకు గాజులు కాళ్లకు పట్ట గొలుసులు ముక్కుకు ముక్కెర చెవులకు కమ్మలు ముఖానికి అమ్మవారిల పసుపు పూసుకొని అలంకారాలు చేసుకోవడం గమనార్హం అయితే కొంతమంది పండితులు పురోహితులు అమ్మవారి దీక్ష తీసుకోవడం అమోఘం అని అమ్మవారి భక్తి శ్రద్ధలు పాటించి అమ్మవారి లాగ అనుకరించక అమ్మవారి సేవకులుగా దీక్షలో కొనసాగాలని హితవు పలుకుతున్నారు ఒకవేళ మహిళ యువతులు దీక్ష తీసుకున్నట్లయితే ఎలాంటి అలంకారాలు చేసుకున్న అమ్మవారి పోలిన విధంగా ఉంటుంది తప్ప మగవాళ్లు ఈ చర్యలకు పాల్పడవద్దని వ్యాఖ్యానిస్తున్నారు హైందవ హిందూ సంప్రదాయంలో భక్తి కన్నా ఎక్కువ ఈ విచిత్ర ఆకృతుల దీక్ష వల్ల ఇతర మతాలకు లోకువ గా కనిపిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు ఈ మేరకు యువకులు భక్తితో మాల వేసుకుని అమ్మవారి దీక్షను భవాని నవరాత్రులు దిగ్విజయంగా జరిపించి నిమజ్జనం చేసి భక్తిని చాటుకోవాలని కోరుతున్నారు

## నిరుద్యోగ యువతకు అండగా పసుల రమేష్

-ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సేవలను ముందుకు తీసుకెళ్తూ



**బోథ్,అక్టోబర్ 11( ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్న ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ పసుల రమేష్‌ను ప్రెస్ రిపోర్టర్లు ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రెస్ రిపోర్టర్ల అధ్యక్షుడు దాసరి పురుషోత్తం, చంద్ర న్యూస్ ఆదిలాబాద్ జిల్లా రిపోర్టర్ చంద్రకాంత్ రెడ్డి అడ్డిగాం మోహన్‌లు సంయుక్తంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పసుల రమేష్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు మేలు చేయాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే సేవా దృక్పథంతో ముందుకు సాగుతూ మరింత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. నిస్వార్థ సేవా భావంతో నిరుద్యోగ యువతకు మార్గదర్శకుడిగా నిలుస్తున్న పసుల రమేష్ సేవలు అభినందనీయమని ప్రెస్ రిపోర్టర్లు కొనియాడారు.

## న్యూ రాంపూర్ గ్రామ విడిసి సభ్యులు, బెల్ట్ షాపు నిర్వా హకుడిపై కేసు నమోదు

**బెల్ట్ షాపు నిర్వహణకురూ. 50 వేలతో వేలం నిర్వాహణ**
**బెల్ట్ షాపు నుంచి రూ.17వేల విలువైన మద్యం స్వాధీనం**
**నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**
**ఆదిలాబాద్ రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ రాంపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రామ విడిసి (విడిసి) ఏర్పాటు చేసి, దాని ద్వారా బెల్ట్ షాపు నిర్వా హణకు రూ.50 వేలతో వేలం నిర్వహించిన వ్యవహారంలో విడిసి సభ్యుడు శాలి కిరావు, మరి కొందరి పై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చే సినట్లు రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్ తెలిపారు. అదేవిధంగా, వేలం ద్వారా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న నిర్వాహకుడు ఆనంద రావుపై కూడా కేసు నమోదు చేసి నట్లు ఎస్సై వెల్లడించారు. పోలీసులు బెల్ట్ షాపుపై చ ర్యలు చేపట్టి, సుమారు రూ.17 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకు న్నారు. గ్రామ విడిసిలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమంగా మద్యం విక్రయాలకు లేదా అక్రమ ఇసుక రవాణాకు వేలం నిర్వహించ డం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని సూ చించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

## ...ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు సహకారంతో 7వ డివిజన్‌లో అభివృద్ధి పనులు

## ...పారిశుద్ధ్యం నుంచి తాగునీటి వరకు ప్రత్యేక దృష్టి.. కార్పొరేటర్ వేల్పుల రవీందర్







**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 11 ప్రజా జ్యోతి:** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా స్థానిక కార్పొరేటర్ వేల్పుల రవీందర్ కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు సహకారంతో డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్య మిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**పారిశుద్ధ్యానికి పెద్దపీట**

డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు 26 మంది పారిశుద్ధ్య కార్మికులను కేటాయించినట్లు కార్పొరేటర్ వెల్లడించారు. ప్రతిరోజూ చెత్త సేకరణ, కాలనీలు, వార్డుల్లో పరిశుభ్రత నిర్వహణపై పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వాటర్ లైన్ల సమస్యలను గుర్తించి, ఎన్నికైన అనంతరం మరమ్మతులు చేయించినట్లు రవీందర్ తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం 2.0 కింద సుమారు రూ.2 కోట్ల వ్యయంతో 15 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

**సింగరేణి కార్మికుల ఇళ్ల పట్టాల కోసం కృషి**

సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాల సమస్యను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే అసెంబ్లీలో సైతం ప్రస్తావించారని పేర్కొన్నారు. జీవో నంబర్ 67 ప్రకారం అర్హులైన కార్మికులకు ఇళ్ల పట్టాలు అందేలా కృషి కొనసాగిస్తున్నట్లు వివరించారు.

**అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా..**

డివిజన్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రవీందర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 38 మంది దివ్యాంగులు, 28 మంది ఒంటరి మహిళలు, మరో 30 మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరయ్యేలా ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. బీసీ కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించే పథకం కింద 15 మంది దరఖాస్తు చేసుకోగా, మైనారిటీ వర్గాలకు చెందిన రెండు కుటుంబాలకు సహాయం అందించే విషయంలోనూ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**ఆడపడుచులకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రయత్నం**

కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డివిజన్‌కు చెందిన ఆరుగురు మహిళలకు రూ.5,016 చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. అలాగే డివిజన్‌లో ఎవరైనా మరణించిన సందర్భంలో బాధిత కుటుంబానికి తన వంతుగా రూ.5,016 ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే అలాంటి దుఃఖకర పరిస్థితులు ఎవరికీ రాకూడదని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

**అసెస్‌మెంట్ సమస్యల పరిష్కారానికి చర్యలు**

నస్పూర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి, అనంతరం మున్సిపాలిటీగా మారిన తర్వాత కూడా సుమారు 30 నుంచి 40 కుటుంబాలు ఇంటి అసెస్‌మెంట్ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఇప్పటివరకు నలుగురికి అసెస్‌మెంట్ చేయించినట్లు వివరించారు. మిగిలిన అర్హుల సమస్యలను సైతం ఎలాంటి అవినీతికి తావులేకుండా, ఉచితంగా, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు**

డివిజన్‌లోని సాయిబాబా ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రవీందర్ తెలిపారు. అదేవిధంగా ఓపెన్ జిమ్, పార్కు, చిన్నారుల కోసం చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

సింగరేణి అనుమతులు లభించిన వెంటనే ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు బోర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అవసరమైతే తన సొంత ఖర్చులతోనూ బోర్లు వేయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

**సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులపై దృష్టి**

సింగరేణి ప్రాంతంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్), జిల్లా ఖనిజ నిధి (డి ఎం ఎఫ్ టి) ద్వారా ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి డివిజన్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వేల్పుల రవీందర్ పేర్కొన్నారు.

## ఆర్.ఎం.పి మండల అధ్యక్షుడిగా రాములు.. సత్కరించిన ఎమ్మెల్యే

**నేరడిగొండ అక్టోబర్ 11 (ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండల కేంద్రంలో ఆర్.ఎం.పి వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఆర్.ఎం.పి సంఘం అధ్యక్షుడిగా చొక్కపల్లి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్.ఎం.పి వైద్యులందరూ కలిసి బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు చొక్కపల్లి రాములును ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... “పల్లెల్లో , గ్రామాల్లో , మారుమూల గిరిజన తండాల్లో, గుడాల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజలకు తక్షణ వైద్య సేవలందిస్తున్న ఆర్.ఎం.పి వైద్యుల సేవలు ఎంతో ప్రశంసనీయం. అత్యవసర సమయంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్నారు” అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల ఆర్.ఎం.పి వైద్యులు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హైదరాబాద్ సరస్ ఫేయిర్ ని సందర్శించిన ఆదిలాబా ద్ జిల్లా జన వికాస సమా ఖ్య ఓబీలు, కార్యనిర్వాహక సభ్యులు



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11, (ప్రజా జ్యోతి)** హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ సమీపంలో హెచ్ ఎం డిఏ గ్రౌండ్ పక్కన ఈ నెల 7 నుంచి 18 వరకు సరస్ ఫెయిర్ లో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ జన వికాస జిల్లా సమాఖ్య ఆదిలాబాద్ నుండి జిల్లా సమాఖ్య ఓబీలు కార్యనిర్వాహక సభ్యులు శనివారం రాత్రి సరస్ ఫెయిర్ బయలుదేరారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించారు. దాదాపు 12 రాష్ట్రాల నుంచి మహిళా సంఘాలు చేస్తున్న ఉత్పత్తులను ప్రత్య క్షంగా చూశారు. ఈ సంద ర్భంగా పలువురు జిల్లా కార్యనిర్వాహక సభ్యులు ఉ త్పత్తుల ను అక్కడి మహిళలతో అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలం ఖైర త్వాడ, ఉట్నూరు మండల కేంద్రంలోని ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద తయారు చేసిన మోహ్ లడ్డు దుకాణాలను సందర్శించారు. జ్యూట్ బ్యా గుల తయారీ తదితర దుకా ణాలను సందర్శించారు. మ హిళా శివ్ సభ్యులు తయా రు చేస్తున్న ఉత్పత్తుల నా ణ్యతను ధరలను వస్తు వు లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భ న కార్యక్రమంలో జిల్లా సమై క్య అధ్యక్షురాలు లక్ష్మీ మంజుష కదం, బోథ్ మండల అధ్యక్షులు కార్యదర్శులు కుంటశోభా రెడ్డి, జాదవ్ శెవంతబాయి, 18 మండ లాల నుంచి బయలుదేరిన మండల సమాఖ్య అధ్యక్షులు, కార్య దర్శి, కోశాధికారి, జిల్లా సమాఖ్య అకౌంటెంట్ ప్రవీణ్ తదితరు లు పాల్గొన్నారు.

## ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య ఉపకేంద్రం!

రెండేళ్లుగా నిరుపయోగంగా భవనం.. ప్రజలకు అందని వైద్య సేవలు

గోడలకు పగుళ్లు.. చుట్టూ పిచ్చిమొక్కలు.. మూలనపడ్డ బాడీ ఫ్రీజర్

ప్రజాప్రతినిధులదా.. అధికారులదా నిర్లక్ష్యం?

**కాసిపేట :** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. కాసిపేట గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో నిర్మించిన ఈ భవనం పూర్తయి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వినియోగంలోకి రాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభానికి ముందే భవనం గోడలకు పగుళ్లు ఏర్పడడం, పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడం నిర్మాణం, నిర్వహణపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే!**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఆరోగ్య ఉపకేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. గర్భిణులకు వైద్య పరీక్షలు, చిన్నారులకు టీకాలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, ప్రాథమిక వైద్య సేవలు ప్రజలకు చేరువ కావాల్సి ఉంది. అయితే కాసిపేటలో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం కాకపోవడంతో స్థానికులు వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

**మూలనపడ్డ విలువైన పరికరం**

ఉపకేంద్రం కోసం సమకూర్చిన విలువైన బాడీ ఫ్రీజర్ సైతం మూలన పడిపోయింది. భవనం ప్రారంభం కాకపోవడంతో ఈ పరికరం ప్రజలకు ఉపయోగపడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని సకాలంలో ప్రారంభించి ఉంటే ప్రజలకు వైద్య సేవలు అందడంతో పాటు పరికరాలు కూడా సద్వినియోగమయ్యేవని అభిప్రాయపడుతున్నారు.

## దసరా నవరాత్రుల్లో భాగంగా ప్రారంభమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సేవ పల్లకి ఊరేగింపు



**ఖానాపూర్ అక్టోబర్ 11( ప్రజా జ్యోతి )** విజయదశమి దసరా నవరాత్రులు సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాల సేవ ఊరేగింపు కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు అర్చకులు చక్రపాణి నరసింహా మూర్తి భక్తాదులచే మేల తాళాలతో పురవీధుల గుండా ఊరేగింపు ప్రారంభమైంది సాయంత్రం ఏడు గంటలకు స్వామివారిని సేవ పల్లకిలో అలంకరించి దేవస్థానం ప్రాంగణం నుండి లారీ అడ్డ,శాంతినగర్ చౌరస్తా మీదుగా శివాజీ నగర్ సాయి నగర్ శ్రీరామ్ నగర్ చేరుకొని పలువురు భక్తాదులకు మంగళహారతులు అర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు తిరిగి శ్రీరాంనగర్ నుండి అంగడి బజార్ పోలీస్ స్టేషన్ మీదుగా జగన్నాథ్ చౌక్ నుండి దేవస్థానం ఆలయ ప్రాంగణం చేరుకుంది తొమ్మిది రోజులు వివిధ వీధుల్లో జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వేద పండితులు నరసింహమూర్తి అన్నారు భగవంతుడు మన ఇంటి పరిసర ప్రాంతాలకు ఊరేగింపుగా వస్తున్న దృశ్య మహిళా భక్తులు మంగళహారతులు ఇవ్వాల్సిందిగా కోరారు

## జాతీయ బీసీ కమిషన్ చైర్ పర్సన్‌ను కలిసిన తెలంగా ణ రాష్ట్ర ఓబీసీ సాధన సమితి చైర్మన్ డా. వెన్న ఈ శ్వరప్ప



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11,(ప్రజా జ్యోతి)** కేంద్ర ప్రభుత్వ నేషనల్ బ్యా క్వర్డ్ క్లాస్ కమిషన్ చైర్ పర్స న్ సాధ్వి నిరంజన్ జ్యోతిని తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సా ధన సమితి చైర్మన్ డా వెన్న ఈశ్వరప్ప ఆదివారంమర్యాద పూర్వకంగా కలిశారు. హై దరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో కలసి చైర్ పర్సన్‌ని సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీల విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ని సమస్యలను పరిష్కరిం చాలని, తెలంగాణ రాష్ట్రం లోని 28 బీసీ కులాలను కేం ద్ర ఓబీసీ జాబితాలో చేర్చా లని విజ్ఞాపన పత్రం అందజేశారు. రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృ ష్ణయ్యతో కలిసి బీసీల హ క్కులను వివరించారు. రా జ్యసభ సభ్యులు ఆర్ కృష్ణ య్య కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, చట్ట స భల్లో బీసీలకు 50% రిజర్వే షన్లు కల్పిం చాలని కోరా రు. బీసీల సమస్యలను కేం ద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింప జేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వివిధ కులసంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## సోనాల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం కు సన్మానం



**సోనాల, అక్టోబర్ 11 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండలం కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ సోనాల మండల మైనార్టీ అధ్యక్షులుగా షేక్ ఇబ్రహీం ను పార్టీ నియమించడంతో వారిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ..నా పార్టీ మైనారిటీ బాధ్యతలు ఇవ్వడం సంతోషమని , పార్టీ బలోపేతం కోసం పని చేస్తానన్నారు. పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శిలు లోలపు పోశెట్టి, చౌహాన్ హరిసింగ్, సోనాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జుంగల భోజన్న, మాజీ సర్పంచ్ సోయం బాపూరావు ,మండల ప్రధాన కార్యదర్శి బాశెట్టి సుదర్శన్, చౌహాన్ సురేందర్, ఆత్రం గోవిందరావు పటేల్, తులసీరామ్, సోనే రావ్, పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావంతో అల్లాడుతున్న అన్నదాతలు.. కరువు జిల్లాగా ప్రకటించాలి..

**భీంసరి గ్రామ పంచాయతీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం..**



**ఆదిలాబాద్, అక్టోబరు 11 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని భీంసరి గ్రామస్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భీంసరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గౌరు కార్తిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలు చేతికందే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు మరోవైపు పశువులకు మేత, తాగునీటి కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. భీంసరి గ్రామంతో పాటు ఆదిలాబాద్ మండలం, జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు, పశు సంపదను కాపాడేందుకు ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కన్వీనర్ బండి దత్తాత్రి, రైతు నాయకులు టింగని పోశెట్టి, కొండ రమేష్, వెంకట నారాయణ, కె.సాయన్న, ఉపసర్పంచ్ సిలివెరి పుల్లయ్య, గ్రామ రక్షణ కమిటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రిమ్స్ ఎస్ ఎన్ సీ యూ ఘటనలో శిశువుల ఆరోగ్యం పై నిరంతర పర్యవేక్షణ

ఐదుగురు శిశువులు మృతి17 మంది డిశ్చార్జి
హైదరాబాద్‌లో ఐదుగురు శిశువులకు చికిత్స
ఆరోగ్యం నిలకడగా ఉంది జిల్లా కలెక్టర్ రాజర్షి షా
నవజాత శిశువుల వైద్య సే వలను మరింత బలోపేతం చేశాం

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 11( ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ రిమ్స్ లోని ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ విభాగం (ఎస్ ఎన్ సీ యూ) ఘటనలో ప్రభావితమైన 27 మంది శిశువుల ఆరోగ్య పరిస్థి తిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ ఘటనలో ఐదుగురు శిశువులు మృతి చెందగా, 17 మంది చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారని, మరో ఐదుగురు హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతు న్నారని వెల్లడించారు. ప్రస్తుతం ఆసుపత్రు ల్లో చికిత్స పొందుతున్న శి శువుల ఆరోగ్య పరిస్థితిని లకడగా ఉందని పేర్కొన్నా రు. చికిత్స అనంతరం ఇళ్ల కు చేరుకున్న 17 మంది శిశువుల ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఏ ఎ న్ ఎంల ద్వారా క్రమంత ప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డిశ్చార్జి అయిన వారిలో ఏడుగురు మహారాష్ట్రకు చెందినవారు కాగా, పది మంది ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారని వివరించారు. మహారాష్ట్ర కు చెందిన ఏడుగురు శిశువుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతర పర్య వేక్షణ కోసం నాందేడ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సమా చారం అందించామని, అక్కడి అధికారు లతో సమన్వయం చేసు కుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆది లాబాద్ జిల్లాకు చెందిన పది మంది శిశువులకు స్థానిక వైద్య సిబ్బంది ద్వారా నిరంతర వైద్య పర్యవేక్షణ అందిస్తు న్నట్లు పేర్కొ న్నారు. నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో ప్రత్యేక నవజా త శిశువుల వైద్య సంరక్షణ విభాగాన్ని (ఎం ఎన్ ఐ సీ యూ), స్టెప్‌డౌన్ యూనిట్ ను బలోపేతం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్ర స్తుతం 18 పడకల ఎం ఎన్ ఐసీయూ, 12



పడకల స్టెప్ డౌన్ యూనిట్ కలిపి మొ త్తం 30 పడకలు అందుబా టులో ఉన్నాయని తెలిపారు. ఎంఎన్ఐసీయూలో ఆక్సిజన్ సదుపా యంతో 11 పడకలు, ఆక్సిజన్ సదు పాయం లేని ఏడు పడకలు ఉన్నాయని వివరించారు. స్టెప్‌డౌన్ యూనిట్‌లో ఆక్సి జన్ సదుపా యంతో 12 పడకలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అదనంగా మరో నాలుగు పడకలను ఏర్పాటు చేయనున్నట్లు, అవి అందుబాటులోకి వస్తే మొత్తం పడకల సంఖ్య 34 కు చేరుతుందని తెలిపా రు.ప్రత్యేక వైద్య సంరక్షణ అవసరమైన నవజాత శిశు వులకు సకాలంలో తగిన చికిత్స అందించేందుకు అవసరమైన వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరు స్తున్నామని కలెక్టర్ తెలిపా రు. ఘటనలో ప్రభావితమై న శిశువుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ, అవసరమైన వైద్య చికిత్సతో పాటు తదుపరి పర్యవేక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. శిశువులకు టుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

## షాద్‌నగర్‌లోని దాదాజీ క్లినిక్‌లో సరిగ్గా చేయని వైద్యం..

బాధితుడు సురేందర్ ఆవేదన
రూ.20 వేలతో పూర్తిగా సమస్య పరిష్కరిస్తామంటూ నమ్మించిన డాక్టర్
ఆపరేషన్ తర్వాత మరింత సమస్య తలెత్తిన వైనం..
గాంధీ లేదా ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాలని ఉచిత సలహా..

**షాద్ నగర్, :** షాద్‌నగర్ పట్టణంలోని దాదాజీ క్లినిక్‌లో వైద్యం సరిగ్గా చేయక సురేందర్ అనే రోగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ?నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన జంగిలి సురేందర్ కొంతకాలంగా రక్తమొలల సమస్యతో బాధపడుతున్నారు. ఓ మిత్రుడి సూచన మేరకు ఆయన షాద్‌నగర్‌లోని దాదాజీ క్లినిక్‌ను ఆశ్రయించి, అక్కడి డాక్టర్ ఎస్. సైదాలును కలిశారు. తన సమస్యను పూర్తిగా వివరించగా.. డాక్టర్ స్పందిస్తూ రూ. 20 వేలు ఖర్చు అవుతుందని, సమస్యను పూర్తిగా క్లియర్ చేసి బాధితుడిని ఆరోగ్యంగా ఇంటికి పంపిస్తామని నమ్మబలికారు. ?డాక్టర్ మాటలను నమ్మిన బాధితుడు సురేందర్ ఒకేసారి రూ. 20 వేలు చెల్లించారు. చికిత్స ప్రారంభించే ముందు ఫార్మాలిటీ నిమిత్తం ఎవరో ఒకరితో సంతకం చేయించుకోవాలని డాక్టర్ అనగా.. అక్కడే ఉన్న తన మిత్రుడు శంకర్ సంతకం చేశారు. ఆ తర్వాత డాక్టర్ ఆపరేషన్ నిర్వహించారు.

**సగం చికిత్స చేసి వదిలేశారంటూ ఆరోపణ**

ఆపరేషన్ అనంతరం సురేందర్‌కు ఉన్న సమస్య కాకుండా కొత్త సమస్య వచ్చింది. మోషన్ రాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. ఈ విషయాన్ని బాధితుడు డాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఏదో తూతూమంత్రంగా ఒకసారి ఎనిమా చేసి పంపించేశారని బాధితుడు ఆరోపించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో, చివరకు డాక్టర్ చేతులెత్తేశారని, ఇక నా వల్ల కాదు, గాంధీ లేదా ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లండి అంటూ

## అధికారంతో పనిలేదు.. మంచి మనసుంటే చాలు...!

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్
కొండారెడ్డిపల్లిలో ఘనంగా బతుకమ్మ చీరల పంపిణీ
మూడేళ్లుగా సొంత నిధులతో ఆడపడుచులకు చీరల పంపిణీ
చేస్తున్న బీఆర్ఎస్ యువనాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్
ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు

**షాద్ నగర్, అక్టోబర్ 11(స్వచ్ఛ తెలంగాణ):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఆడపడుచులకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించేవారని, ప్రభుత్వం మారినప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగాలనే ఉద్దేశంతో ప్రేమ్ కుమార్ గౌడ్ గత మూడేళ్లుగా తన సొంత నిధులతో గ్రామంలోని ఆడపడుచులకు చీరలు పంపిణీ చేయడం హర్షణీయమని కొనియాడారు. గ్రామంలోని మహిళలందరినీ తన తోటి ఆడపడుచులుగా భావించి, సోదరభావంతో ప్రతి సంవత్సరం చీరలు పంపిణీ చేస్తున్న ప్రేమ్ కుమార్ గౌడ్ కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పర్వత్ రెడ్డి, సర్పంచులు మంజుల జంగయ్య, భాస్కర్ నాయక్, ధనలక్ష్మి రామకృష్ణ, సులోచన శ్రీను, భారతి రవీందర్, ఉప సర్పంచులు నరేష్, దర్శన్, షకీల్, మాజీ సర్పంచులు గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ హెల్త్ క్యాంపు ప్రారంభించిన జనసేన నాయకులు: ముమ్మరెడి ప్రేమ కుమార్

**కూకట్పల్లి :** కూకట్ పల్లి నియోజకవర్గం గాయత్రి నగర్ డివిజన్ వివేకానంద నగర్ రాయల్ ఒక్స్ స్కూల్ లో జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో రివైవ్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసినటువంటి మెడికల్ క్యాంపు కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు మరియు స్థానిక ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. డయాబెటిక్ ఫుట్, వెరికోవెన్స్, రక్తనాళాలు, సాధారణ ప్రసవం, మోకాళ్ళ సమస్య, మెదడు వ్యాధులు, చిన్నపిల్లల డాక్టర్ మరియు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని .. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు సహాయపడతాయని తెలిపారు, ఇటువంటి ప్రజాసేవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వీర మహిళలకు మరియు ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ మెంబర్ ప్రజిత్ గౌడ్, కొల్లా శంకర్, శ్రీనివాస్ గోవిందా,పవన్, వీరబాబు మరియు వీర మహిళలు దుర్గ లక్ష్మి, రత్న వేణి, నాగ వరలక్ష్మి, రాధిక, సింధు, వానిదేవి, శ్రీదేవి, సరోజినీ, నారాయణమ్మ, సుజాత,సత్య, భూలక్ష్మి, సత్యవతి, నాగలక్ష్మి, కుమారి, వీర వేణి, విజయలక్ష్మి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సాలెగూడలో దండారి దీపావళి దర్బార్‌కు సన్నాహాలు

**ఆదివాసీ సంప్రదాయానికి ప్రతీకగా గుస్సాడి నృత్యాలు**

**కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం సాలెగూడలో ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎత్మసూర్ దండారి దీపావళి దర్బార్ వేడుకలకు కళాకారులు సన్నాహాలు చేస్తున్నారు. డప్పుల మోతలు, గుస్సాడి నృత్యాలతో పండుగను వైభవంగా నిర్వహించేందుకు చిన్నాపెద్దా తేడా లేకుండా గ్రామస్థులు సమాయత్తమవుతున్నారు. ఆదివాసీ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే దండారి పండుగ ముఖ్య ఉద్దేశమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. చదువుతో పాటు తమ పూర్వీకుల నుంచి వస్తున్న కళలను కాపాడుకోవడం, ఒకరినొకరు గౌరవించుకోవడం ఈ వేడుకల ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. సూర్యవంశీ రాజ్‌గోండ్ సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే ఈ ఉత్సవాలు గిరిజనుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని వారు తెలిపారు. దండారి సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం పండుగకు ముందుగా అందించే ఆర్థిక సాయాన్ని అర్హులైన దండారి బృందాలకు సకాలంలో అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ఐటీడీఏ ఉట్నూరు ద్వారా అర్హులైన దండారి బృందాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## భక్తిశ్రద్ధలతో భవానీమాతకు ఘన స్వాగతం!

మహిళల మంగళహారతులు.. యువత నృత్యాలు..
హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**షాద్‌నగర్, అక్టోబర్ 11,(స్వచ్ఛ తెలంగాణ):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఈశ్వర్ కాలనీలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న శ్రీ భవానీమాత అమ్మవారి విగ్రహానికి కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో అమ్మవారికి నీరాజనాలు అర్పించగా, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. డప్పుల దరువులు, అమ్మవారి జయజయధ్వానాలతో ఈశ్వర్ కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆగమన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై భవానీమాతకు స్వాగతం పలికారు.

# సమాచార హక్కు చట్టం-2005 ప్రజల హక్కు దాచడం నేరం! ఆర్టిఐ చట్టానికి 21 ఏళ్లు

**మద్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ సుదీర్ఘ పోరాటం,అరుణ్ రాయ్ లాంటి సామాజిక కార్యకర్త త్యాగ ఫలితమే**

**రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్-2005 అమలులో ఉంది. సమాచార హక్కు చట్టం-2005 శిక్షకులు రామ్ టెంకి కృష్ణ:బి**

**అక్టోబర్11,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని సిర్పూర్ కాగజ్ నగర్ మండలం బట్టుపల్లి కి చెందిన రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్-2005, ట్రైనర్ రామ్టెంకి కృష్ణ పత్రిక ప్రకటనలు మాట్లాడుతూ. సమాచారం ప్రజల హక్కు అని అన్నారు. సమాచారాన్ని దాచడం నేరమని సూచించారు. ఆర్టిఐ చట్టానికి 21 ఏళ్లు పూర్తయిందని గుర్తు చేశారు.అత్యంత శక్తివంతమైన భారత ప్రజాస్వామ్య చరిత్రలో అక్టోబర్ 12, 2005 ఒక చారిత్రాత్మక రోజు. ఆ రోజే సామాన్యుడి చేతిలో అత్యంత శక్తివంతమైన ఆయుధాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు.అదే సమాచార హక్కు చట్టం - 2005 (రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ 2005). నేటికి ఈ చట్టం అమలులోకి వచ్చి 21 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ 21 ఏళ్ల ప్రయాణాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, సాధించింది ఎంతో, సాధించాల్సింది ఇంకెంతో అర్థమవుతుంది.

**ఆర్టిఐపుట్టుక వెనుక పోరాటం:**

ఈ చట్టం ఊరికే రాలేదు. రాజస్థాన్ లోని మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకెఎస్ ఎస్) చేసిన సుదీర్ఘ పోరాటం,అరుణా రాయ్ లాంటి సామాజిక కార్యకర్తల త్యాగం ఫలితంగా ఈ సమాచార హక్కు చట్టం వచ్చిందని గుర్తు చేశారు. “మన డబ్బు - మన లెక్క” అనే నినాదంతో మొదలైన ఈ ఉద్యమం, చివరికి పార్లమెంట్ ను కదిలించిందని అన్నారు.

**చట్టం చెప్పేది ఏమిటి?**

ఈ దేశ పౌరుడైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం దగ్గర ఉన్న సమాచారాన్ని అడిగే హక్కు ఉంది. పార్లమెంట్ నుండి పంచాయతీ వరకు, ప్రధానమంత్రి కార్యాలయం నుండి గ్రామ కార్యదర్శి వరకు ఎవరైనా జవాబు చెప్పాల్సిందే. కేవలం 10 రూపాయల ఫీజుతో దరఖాస్తు పెడితే, 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలి. ఇవ్వకపోతే, తప్పుడు సమాచారం ఇస్తే సంబంధిత అధికారికి రోజుకు రూ.250 చొప్పున రూ.25,000 వరకు జరిమానా విధించే అధికారం సమాచార కమిషన్ కు ఉంది (సెక్షన్ 20). తెలియజేస్తుందని అన్నారు.

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పరిస్థితి:**

మన జిల్లా అటవీ, గిరిజన ప్రాంతం. ఇక్కడే ఈ చట్టం ఎక్కువ అవసరం. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

1. సెక్షన్ 4(1)(ఎ) - కాగితాలకే పరిమితం: చట్టం ప్రకారం ప్రతి కార్యాలయం 17 అంశాల సమాచారాన్ని స్వచ్ఛందంగా బోర్డు మీద పెట్టాలి. బడ్జెట్ ఎంత? పనులకు ఎంత ఖర్చు చేశారు? ఉపాధి హామీలో ఎన్ని రోజులు పని ఇచ్చారు? కానీ జిల్లాలోని 90% పంచాయతీల్లో ఈ బోర్డులు లేవు. కాగజ్ నగర్, సిర్పూర్, ఆసిఫాబాద్ మండలాల్లోని చాలా పంచాయతీల్లో 2023 తర్వాత ఆడిట్ కూడా జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. అని అన్నారు.

**2. ఈ-గవర్నెన్స్ మాటలకే:**

ఈ- గ్రామ్ స్వరాజ్ ఎంజిఎన్ఆర్ఇజిఎ పోర్టల్ లలో సమాచారం అప్ లోడ్ చేయడం లేదని ఆరోపించారు. దీంతో ప్రజలకు ఆన్ లైన్ లో సమాచారం దొరకడం లేదని అన్నారు.

**3. పిఐఓల నిర్లక్ష్యం:**

చాలా శాఖల్లో ఆర్టిఐ దరఖాస్తును తీసుకోవడానికి కూడా భయపడుతున్నారని రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ట్రైనర్ రామ్ టెంకి కృష్ణ అన్నారు. “ఇది మా దగ్గర లేదు, వేరే శాఖలో ఉంది” అని తిప్పుతున్నారు. 30 రోజుల గడువును పాటించడం లేదు.

4. దాడులు, బెదిరింపులు: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఐ కార్యకర్తలపై దాడులు పెరుగుతున్నాయి. సమాచారం అడిగినందుకు బెదిరింపులు ఎదుర్కొంటున్న సందర్భాలు మన జిల్లాలో కూడా ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదం.మనం ఏం చేయాలి? - ఈ దినోత్సవం సందర్భంగా డిమాండ్లు:

1. జిల్లా కలెక్టర్ వెంటనే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెక్షన్ 4(1)(బి) అమలుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి.

2. ప్రతి మండల కేంద్రంలో ఆర్టీఐ అవగాహన సదస్సులు నిర్వహించాలి. గిరిజన గ్రామాల్లో గోండీ, కొలామీ భాషల్లో కూడా కరపత్రాలు పంచాలి. 3. జిల్లా సమాచార విభాగంలో ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, ఆర్టీఐ దరఖాస్తు రాయడంలో సామాన్యులకు సహాయం చేయాలి. 4. సకాలంలో సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకుంటేనే, మిగతా వారికి బుద్ధి వస్తుంది. ఆర్టీఐ అనేది



కేవలం ఒక దరఖాస్తు కాదు, అది ఒక సంస్కృతి. ప్రశ్నించే సంస్కృతి. “మా గ్రామంలో రోడ్డు ఎందుకు వేయలేదు? మా పాఠశాలకు నిధులు ఏమయ్యాయి?” అని అడగడం ప్రతి పౌరుడి బాధ్యత. అధికారులు సమాధానం చెప్పడం వారి బాధ్యత మాత్రమే కాదు, చట్టపరమైన విధి. 21 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా, ప్రతి యువకుడు ఆర్టీఐని ఒక ఆయుధంగా మలుచు కోవాలి. అప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది. అవినీతి అంతం అవుతుంది. సమాచారం అడగండి - ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అని సమాచార హక్కు చట్ట శిక్షకులు రామ్ టెంకి కృష్ణ పిలుపునిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో భవానీమాతకు ఘన స్వాగతం!

మహిళల మంగళహారతులు.. యువత నృత్యాలు..

హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**షాద్‌నగర్, అక్టోబర్ 11,(స్వచ్ఛ తెలంగాణ):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఈశ్వర్ కాలనీలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించనున్న శ్రీ భవానీమాత అమ్మవారి విగ్రహానికి కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో అమ్మవారికి నీరాజనాలు అర్పించగా, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. డప్పుల దరువులు, అమ్మవారి జయజయధ్వానాలతో ఈశ్వర్ కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆగమన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై భవానీమాతకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమీన్పూర్ డివిజన్ అధ్యక్షునిగా కొత్తపల్లి రమేష్ ఎన్నిక

**అమీన్పూర్:** భారతీయ జనతా పార్టీ అమీన్పూర్ డివిజన్ అధ్యక్షునిగా కొత్తపల్లి రమేష్ ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ,ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని కొత్తపల్లి రమేష్ తెలిపారు.నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## షాద్‌నగర్‌లో డికోడ్ మెన్స్ క్యాజువల్ క్లబ్ రెండో బ్రాంచ్ ప్రారంభం

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ లు**

**ప్రత్యేక పూజలు చేసి నిర్వాహకులను ఆశీర్వదించిన నేతలు**

**షాద్ నగర్, :** షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో డికోడ్ మెన్స్ క్యాజువల్ క్లబ్ రెండో బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకుడు చందు మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణ ప్రజలకు గత నాలుగేళ్లుగా తమ మొదటి బ్రాంచ్ ద్వారా సేవలందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో పరిగి రోడ్డులో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా వివిధ రకాల మెన్స్ క్యాజువల్ దుస్తులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. తమ షాప్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీర్వదించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్‌తో పాటు స్థానిక నాయకులకు నిర్వాహకులు చందు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లికట్ట మాజీ సర్పంచ్ సాయి, స్థానిక నేతలు, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.